



ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీ

- ఇండియా ఏ 288/8
- అర్ధ సెంచరీలతో రాణించిన సామ్స్ ములానీ, తనుష్
- దులీప్ ట్రోఫీలో బ్యాటర్ల సత్తా



సెంచరీ అభివాదం చేస్తున్న ఇషాన్ కిషన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఇండియా బి టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా సి జట్టు క్రీడాకారుడు ఇషాన్ కిషన్ సెంచరీతో కదంతొక్కాడు. కిషన్ అద్భుత ఆటతో ఇండియా సి జట్టు భారీ స్కోర్ దిశగా పయనిస్తోంది. మరో మ్యాచ్‌లో ఇండియా ఏ, డీ జట్లు పోటీ పడ్డాయి. ఇండియా ఏ జట్టులో సామ్స్ ములానీ, తనుష్‌లు అర్ధసెంచరీలు సాధించగా ఏ జట్టు గౌరవప్రదమైన స్కోర్ చేసింది. గురువారం నాడు అనంతపురం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ఉన్న రెండు మైదానాల్లో రెండో రౌండ్ మ్యాచ్ ఇండియాఏ, డీ మధ్య, ఇండియా బీ, సీ జట్ల మధ్య నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు మొదలైయ్యాయి.

ఇషాన్ కిషన్ మెరుపులు.. ఇండియా సి 375/5

టాస్ నెగ్గిన ఇండియా బి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. భారత జట్టు వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ఇండియా బితో జరిగిన మ్యాచ్‌లో మెరిశాడు. రెండవ స్థానంలో వచ్చిన ఇషాన్ కిషన్ 126 బంతుల్లో 14 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సహాయంతో 111 పరుగులు చేశాడు. ఇతనికి తోడుగా బాబా ఇంద్రజిత్ 136 బంతుల్లో 9 బౌండరీల సహాయంతో 78 పరుగులు చేశాడు. రుతురాజ్ గైక్వాడ్ 46, సాయిసుదర్శన్ 43, రజత్ పటిదార్ 40 పరుగులు చేశారు. ఆటముగిసే సమయానికి ఇండియా సి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 79 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 375 పరుగులు చేసింది. ఇండియా బి జట్టు బౌలర్లలో ముకేష్‌కుమార్ 3, నవదీప్ శైనీ, రాహుల్ చాహర్ చెరో వికెట్ తీసుకున్నారు.

ఇండియా ఏ జట్టు 288/8

మరో మ్యాచ్‌లో ఇండియా ఏ, డీ జట్లు పోటీ పడ్డాయి. టాస్ నెగ్గిన ఇండియా డీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. ఇండియా ఏ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆటముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 288 పరుగులు చేసింది. జట్టులో సామ్స్ ములానీ 88(8 ఫోర్లు, 3 సిక్స్‌లు), తనుష్ కొటియన్(6 ఫోర్లు, ఒక సిక్సర్)తో అర్ధసెంచరీలు చేశారు. ఐపిఎల్ స్టార్ ప్లేయర్ రియాన్ పరాగ్ 29 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్ సహాయంతో 37 పరుగులు చేశారు. ఇండియా డీ బౌలర్లలో హర్షిత్ రాణా, కవిరప్ప, అర్షదీప్ సింగ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

అనంత ఉద్యమాన ఏచూరి

- పలుమార్లు జిల్లాకు విచ్చేసిన సీతారాం ఏచూరి
- వామపక్ష నాయకులతో సమావేశాలు





పుట్టపర్తి సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరికి నివాళులు అర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి ఉమ్మడి అనంతపురం జిల్లాతో అనుబంధముంది. ఆయన పలు సందర్భాల్లో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేశారు. నిమోనియాతో బాధపడతూ గురువారం నాడు ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా ఆయన సిపిఎం శ్రేణులతోపాటు, మేధావులు, వామపక్ష సానుభూతిపరులు జోహర్లు తెలియజేయస్తూ జిల్లాలోనూ ప్రకటనలు విడుదల చేశారు. అనంతపురం జిల్లాతో ఆయనుకున్న అనుబంధం గురించి సిపిఎం నేతలు స్మరించుకున్నారు.

అనేకసార్లు అనంతపురం జిల్లాలో పర్యటన

దేశంలోనే అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లాలో సీతారం ఏచూరి అనేకమార్లు పర్యటించారు. 2002లో సిపిఎం రాష్ట్ర మహాసభలు అనంతపురం నగరంలో జరిగాయి. సంగమేష్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ మహాసభలకు అప్పటి సిపిఎం జాతీయ కార్యదర్శి సూర్జిత్ సింగ్‌తో కలసి ఆయన అనంతపురం విచ్చేశారు. ఆ తరవాత 2004 సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ అనంతపురానికి విచ్చేశారు. ఆ తరువాత కూడా వివిధ సందర్భాల్లో ఆయన జిల్లాకు విచ్చేశారు. 2018వ సంవత్సరంలో సిపిఐ నాయకులు నీలం రాజశేఖర్‌రెడ్డి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు అనంతపురం విచ్చేశారు. ఆ సమయంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబుళు గుండె శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో ఉన్న సమయంలో ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. గతేడాది కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బాగేపల్లి అసెంబ్లి నియోజకవర్గంలో సిపిఎం పోటీ చేసింది. ఆ సమయంలో సిపిఎం అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో ఏచూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి వేసిన ప్రత్యేక సంచికను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది.

ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.నరసింగరావు తెలిపారు. గురువారం పుట్టపర్తిలోని సిపిఎం కార్మిక భవనంలో ఏచూరికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974లో ఎస్ఎఫ్ఐలో సభ్యుడిగా ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. ఆ మరుసటి ఏడాదే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్ట్) సభ్యునిగా చేరారని చెప్పారు. దేశంలో అత్యవసర పరిస్థితి ఎత్తివేసిన తర్వాత జెఎన్‌యు విద్యార్థి నాయకునిగా ఏచూరి మూడుసార్లు ఎన్నికయ్యారని చెప్పారు. 1978లో అఖిల భారత ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా, ఆ తర్వాత అధ్యక్షునిగా ఎన్నికయ్యారన్నారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి సిపిఎం ప్రధాన కార్యదర్శి అయ్యారన్నారు. అమెరికా విదేశాంగ విధానాన్ని ఏచూరి తీవ్రంగా వ్యతిరేకించారని చెప్పారు. భారత గణతంత్ర వేడుకలకు బరాక్ ఒబామా ముఖ్య అతిథిగా రావటాన్ని కూడా ఆయన వ్యతిరేకించారన్నారు. ప్రతి విషయంలోనూ ప్రజా కోణంతో ఆలోచించే మేధావి అన్నారు. అలాంటి వ్యక్తి మరణం ప్రజలు, వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈఎస్.వెంకటేష్ జిల్లా కమిటీ సభ్యులు జివిఎల్.నరసింహులు, లక్ష్మీనారాయణ, దిల్షాద్, జెడ్పీ శ్రీనివాసులు, సాంబశివ, సిద్ధు, సాకే వెంకటేష్, బ్యాల్ల అంజి, పవన్ కుమార్ పాల్గొన్నారు.



2002లో అనంతపురంలో జరిగిన సిపిఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా అప్పటి సిపిఎం జాతీయ కార్యదర్శి సూర్జితింగ్‌తో ఏచూరి



2018లో గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న సిపిఎం సీనియర్ నాయకుడు జి.ఓబులను పరామర్శిస్తున్న సీతారం ఏచూరి



2023 కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బాగేపల్లి నియోజకవర్గంకు సంబంధించి ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఏచూరి

నిమజ్జనం పూర్తయ్యే వరకు అప్రమత్తత అవసరం

ఎస్పీ వి.రత్న



ఏర్పాట్లను పరిశీలన చేస్తున్న ఎస్పీ వి. రత్న

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో శుక్రవారం నిర్వహించే వినాయక నిమజ్జనం పూర్తయ్యే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వి.రత్న పోలీస్ అధికారులకు సూచించారు. నిమజ్జనం ఏర్పాట్లు, బందోబస్తును పరిశీలించారు. మసీద్ ప్రాంతాల్లో పర్యటించి శోభయాత్ర సమయంలో తీసుకోవాల్సిన బందోబస్తు, ఏర్పాట్ల జాగ్రత్తలపై పోలీసు అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశం నిర్వహించి పోలీస్ అధికారులతో బందోబస్తు ఏర్పాట్లు, నిర్వహించాల్సిన విధులపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. పట్టణంలో నిమజ్జనం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. ఏ చిన్న సంఘటన కూడా తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ సమస్యలు వంటివి రాకుండా చూడాలన్నారు. నిమజ్జన ప్రాంతంలో వద్ధులు, చిన్న పిల్లలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగే విధంగా పోలీస్ వారికి పట్టణ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ, డీఎస్పీ కెవి.మహేష్, సిఐ, ఎస్ఐలు ఇతర అధికారులతో పాటు మున్సిపల్ డిఈఈ బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అన్ని సౌకర్యాలూ కల్పించండి

శుక్రవారం పట్టణంలో జరిగే నిమజ్జన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అసవరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ రమేష్ కుమార్‌లు మున్సిపల్ అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని గుడ్డం కోనేరును విడివిడిగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, టిడిపి నాయకులు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎంఇ విశ్వనాథ్, డిఈఈ బాల సుబ్రమణ్యంలు వినాయక నిమజ్జనంలో భాగంగా కోనేరు వద్ద నిమజ్జనం కోసం రెండు కౌంటర్‌లను ఏర్పాటు చేసి, రెండు భారీ క్రేన్‌లను ఏర్పాటు చేశామన్నారు. కోనేరు వద్ద ఇరు వైపులా బ్యారీ గేట్లను ఏర్పాటు చేశామన్నారు. వినాయక శోభాయాత్రలో భాగంగా అడ్డంగా ఉన్న విధ్యుత్ తీగలను తొలగించి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప, మున్సిపల్ మాజీ ఛైర్మన్‌లు అనిల్ కుమార్, బిఎస్.విద్యాసాగర్, పలువురు కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

పోరాటం వల్లే తాగునీటి సరఫరా కార్మికులకు నిధులు మంజూరు - సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.నరసింగ రావు



కార్మికులకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న నరసింగరావు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ బకాయి సమస్యలను పరిష్కరించేంత వరకు ఉద్యమం ఆగదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగ రావు హెచ్చరించారు. గురువారం పుట్టపర్తి పట్టణంలో కార్మికుల చేపట్టిన నిరసన దీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. కార్మికుల దీక్షకు నర్సింగరావు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న జీతాలు 30 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించిందే తప్పా ఇంకా కార్మికుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. గత ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్‌ను ఏర్పాటు చేసి కార్మికులను తగ్గించేందుకు చేసిన ప్రయత్నాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ సంగతిపై ప్రభుత్వం తన విధానం ఏమిటో ప్రకటించలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కుళాయిలకు స్మార్ట్ మీటర్లు బిగించకూడదని, ఉచితంగానే నీరు సరఫరా చేయాలన్నారు. పోరాటం చేయడం వల్లే ప్రభుత్వం పెండింగ్ వేతనాలు రూ.30 కోట్లు ప్రకటించిందన్నారు. కార్మికుల డిమాండ్ల అమలు చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు మాట్లాడుతూ చేసిన పనికి వేతనాలు అడుగుతున్నారే తప్పా ఉచితంగా ఇవ్వాలని కార్మికులు కోరలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మిగతా సమస్యలు కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నీటి సరఫరా కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్, యూనియన్ నాయకులు మధు, ప్రభు, శ్రీనివాస్, రవి, చంద్ర పాల్గొన్నారు.

హిందూపురంలో భిక్షాటన

హిందూపురం : నిత్యం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నీటిని సరఫరా చేసే విధుల్లో ఉన్న శ్రీ రామిరెడ్డి నీటి సరఫరా కార్మికులకు వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సమస్యలను పరిష్కరించకపోవడం విచారకరం అని సిఐటియు నాయకులు రాము ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా కార్మికుల ఆందోళనలో భాగంగా గురువారం నాడు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ నుంచి బిఎస్‌టి పెట్రోల్ బంకు, సద్భవన్ సర్కిల్, పరిగి బస్టాండ్ వరకు ప్రతి షాపునకు వెళ్లి జోలీ పట్టి అడుక్కున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ శ్రీరామి రెడ్డి నీటి పథకంలో గత 14 సంవత్సరాల నుంచి వందలాది మంది కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. నెలల కొద్ది వేతనాలు ఇవ్వక పోతే కార్మికులు వారి కుటుంబ పోషణ ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న 7 నెలల వేతనాలతో పాటు 30 నెలల పిఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేంద్ర, రవి, జిబివుల్లా, గిరీష్, హనుమంతు, జగదీష్, మంజు, మల్లికార్జున, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరుకునేలా గృహ నిర్మాణ పనులు : కలెక్టర్



కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పేదల కోసం నిర్మిస్తున్న జిల్లా నిర్మాణాలు 100 రోజుల ప్రణాళికల లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో అధికారులతో గహ నిర్మాణ పనులపై సమీక్షించారు. కలెక్టర్‌తో పాటు హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఈఈలు, డిఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 72,353 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా దాదాపు 22,756 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన ఇళ్లను 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి సత్వరమే ఇళ్లను పూర్తి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఈనెల 20వ తేదీ లోపు 3190 గహాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం, కదిరి, పెనుకొండ డిఈలు శివశంకర్, శ్రీనివాస్, శివకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డ్ ఉన్న కూలీలకు 100 రోజులు పని కల్పించాలి

జాబ్ కార్డ్ కలిగిన వారికి వందరోజుల పని దినాలను ఖచ్చితంగా కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పనులు పంచాయతీ రాజ్ పనులపై అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన పని దినాలు 79 లక్షలు కాగా 57.19 లక్షలుగా గణాంకాల వివరాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు కల్పించాలన్నారు. ముఖ్యంగా కొలతల ప్రకారం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పెండింగ్ బిల్లులు ప్రభుత్వం మంజూరు చేసిందని సత్వరమే కూలీలకు చెల్లించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, పంచాయతీ రాజ్ ఎస్ఈ మురళి మోహన్, గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ట్రాక్టర్లు పంపిణీ

ప్రజాశక్తి-మడకశిర

గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ఉచితంగా ట్రాక్టర్లు పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం ఎమ్మెల్యే ఆయా పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామా ల్లో రోగాలు ప్రబలకుండా స్వచ్ఛత పాటించేందుకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సమిష్టిగా పని చేయాలని తెలిపారు. వర్షాకాలంలో రోగాలు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకొని ముందు జాగ్రత్తగా పరిశుధ్యం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ట్రాక్టర్‌ను నడిపారు. అలాగే నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో టిడిపి అభివృద్ధికి కృషి చేసిన వారిని అభినందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కుంచితి వక్కలిగ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్పతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

డీఎస్సీ శిక్షణార్థులకు మెటీరియల్ పంపిణీ

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటుచేసిన డీఎస్సీ ఉచిత శిక్షణకు హాజరవుతున్న అభ్యర్థులకు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులు బాగా చదివి ఉద్యోగాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, కుంచితి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్ప, శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు, మండల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు



డీఎస్సీ శిక్షణార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

పెనుకొండలో అరాచక పాలన

మంత్రి సవితపై మాజీ మంత్రి ఉషశ్రీచరణ్



కలెక్టర్ చేతన్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెనుకొండ నియోజకవర్గంలో అరాచక పాలన సాగుతుందని మాజీ మంత్రి, జిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. ఆమె గురువారం కలెక్టర్ టిఎస్. చేతన్‌ను కలిసి నిధులు మంజూరుపై వినతి పత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ పెనుకొండలో సర్పంచులకు నిధులు మంజూరు చేయాలంటే టిడిపి కండువా కప్పుకోవాలని మంత్రి సవిత చెప్పడం దారుణమన్నారు. అధికారులు సైతం మంత్రికి వత్తాసు పలుకుతున్నారని, నిధులు మంజూరు చేయకుండా పెండింగ్‌లో ఉంచిన అధికారులపై ప్రయివేట్ కేసులు వేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో నిధులు మంజూరు చేయకుండా అడ్డుకోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వైస్ ఛైర్మన్ మాతంగి తిప్పన్న, పుడా ఛైర్మన్ లక్ష్మీనరసమ్మగంగాద్రి, నాయకులు ఎ.రమణారెడ్డి, రంగారెడ్డి, నరసారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున, ఎస్‌టిడి నరసింహులు, సుధాకర్‌రెడ్డి, గంపల రమణారెడ్డి, జడ్పిటిసి పాలే జయరాంనాయక్, రఘునాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

అబద్ధపు రాజకీయాలు మానుకో..

ఉషశ్రీచరణ్‌కు సర్పంచుల హితవు



మాట్లాడుతున్న రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- పెనుకొండ

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అబద్ధపు రాజకీయాలు మానుకోవాలని పలువురు సర్పంచులు హితవు పలికారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉషశ్రీ ఉనికి కోసం సర్పంచులను వాడుకోవడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె సర్పంచి నిధుల గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పెనుకొండ నియోజకవర్గంలో వైసిపి హయాంలో ఒక్క సర్పంచి అయినా కనీసం ఒక కిలోమీటర్ సిమెంట్ రోడ్డు వేశారా? అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో సర్పంచులకు రూపాయి నిధులు ఇవ్వకుండా, విలువ లేకుండా చేయడంతోనే వైసిపికి 11 సీట్లు వచ్చాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు నిధులు విడుదల చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని, రాజకీయ పబ్బం కోసం చౌకబారు మాటలు మాట్లాడితే సహించేలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీనివాసులు, బాలాజీ, నాగరాజు, సువర్ణ అశ్వర్థరెడ్డి, నరసింహమూర్తి, నరసింహులు, మంజు, జనార్ధన్, నాగరాజు, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, మండల కన్వీనర్ సిద్దయ్య, టౌన్ కన్వీనర్ శ్రీరాములు, మాజీ సర్పంచి సోము, త్రివేంద్ర, పోతిరెడ్డి రామకృష్ణ, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో టిడిపి నేత కొడవలితో వీరంగం

యువకుడికి గాయాలు



కొడవలితో వీరంగం సృష్టిస్తున్న శ్రీహరినాయుడు

హిందూపురం : పట్టణంలోని లక్ష్మీపురంలో ఓ టిడిపి నాయకుడు శ్రీహరి బుధవారం రాత్రి కొడవలితో వీరంగం సృష్టించడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని లక్ష్మీపురంలో కొందరు యువకులు కలిసి వినాయక ప్రతిమను ఏర్పాటు చేశారు. మండపం వద్ద యువకులు డిజె పెట్టి సందడి చేస్తుండగా శ్రీహరి నాయుడు వచ్చి తన తల్లి ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో ఆ యువకులు సౌండ్ తగ్గించారు. అప్పుడు వెళ్లిపోయిన శ్రీహరినాయుడు మరోమారు మద్యం మత్తులో కొడవలి తీసుకుని మండపం వద్దకు వచ్చి వీరంగం సృష్టించి భయభ్రాంతులకు గురి చేశాడు. సమాచారం అందుకున్న కానిస్టేబుల్ అక్కడికి చేరుకోగా అతడిపై కూడా దూషణలకు దిగాడు. ఎలాగోలా స్థానికులు, మండపం నిర్వాహకులు అతడి నుంచి కొడవలి లాక్కున్నారు. దీంతో ఇంటికి వెళ్లిన అతడు మరోమారు కత్తి తీసుకొని వచ్చి హల్‌చల్ చేయడంతో పాండురంగకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అతడికి దేహశుద్ధి చేసి టూ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ అబ్దుల్ కరీం తెలిపారు.

విద్యాసంస్థలను సందర్శించాలి : ఎంపిడిఓ

పుట్టపర్తి రూరల్ : ప్రతి గ్రామ సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు ప్రతి గురు, సోమవారాల్లో గ్రామ సచివాలయ పరిధిలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో సందర్శించాలని ఎంపిడిఓ నాగేశ్వరరెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, మరుగుదొడ్ల పరిశీలించి వాటిని ఐఎంఎంఎస్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు. అన్ మ్యాప్ స్కూల్స్ ఉంటే సదరు స్కూల్ హెచ్ఎం చేత మ్యాపింగ్ చేయించుకోవాలన్నారు. ఇన్‌ఛార్జ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు కూడా పాఠశాలలను సందర్శించాలన్నారు. ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదన్నారు. ఎవరైనా సెలవుపై వెళ్లాల్సి వస్తే మరొకరికి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పజెప్పాలన్నారు. సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వెంగళమ్మ చెరువు ప్రాథమిక పాఠశాల, చెర్లోపల్లి గ్రామంలోని చెత్తతో సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించారు. గ్రామాల్లో పరిశుభ్రతపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లు సీజ్



వాటర్ ప్లాంట్లను సీజ్ చేస్తున్న కమిషనర్ ప్రహ్లాద

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీలోని సాయినగర్, పెద్ద బజార్‌లో నిర్వహిస్తున్న సుజల స్రవంతి తాగునీటి వాటర్ ప్లాంట్లను మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద గురువారం సీజ్ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఆయా వాటర్ ప్లాంట్లలో ఆర్ఓ వాటర్‌పై ప్రజల ఫిర్యాదు మేరకు నీటిని పరీక్షలకు పంపామన్నారు. పిహెచ్ విలువ 6.5 నుంచి 8.5 మధ్యలో ఉండాల్సి ఉండగా 5.63గా చూపిందని తెలిపారు. ఈ నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని, దీంతో రెండు ప్లాంట్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. కమిషనర్ వెంట మున్సిపల్ అధికారులు ఉన్నారు.

సిఎం చంద్రబాబును కలిసిన రత్నాకర్



సిఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న రత్నాకర్

పుట్టపర్తి క్రైమ్ : శ్రీసత్యసాయి ట్రస్టు సభ్యులు ఆర్‌జె.రత్నాకర్ గురువారం సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. దాదాపు 7వేల వరద బాధిత కుటుంబాలకు ట్రస్టు తరఫున బుధవారం 20 రకాల నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేసినట్లు రత్నాకర్ వారికి వివరించారు. ట్రస్ట్ తరఫున సేవా సమితి సభ్యులు అందించిన సేవా కార్యక్రమాలపై సిఎం, మంత్రి ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారని ఆయన తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సత్య సాయిబాబా స్ఫూర్తితో నిరంతరం కొనసాగాలని సిఎం తెలిపారని రత్నాకర్ తెలిపారు.

పాఠశాలల తనిఖీ

పుట్టపర్తి క్రైమ్ : మండలంలోని వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి ఎంపిపి పాఠశాలలను గురువారం ఎంపిడిఓ నాగేశ్వర్‌రెడ్డి సందర్శించి విద్యార్థుల హాజరు, పరిసరాలు, వంటగది, బాత్రూమ్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. పాఠశాల ఆవరణలో విరివిగా మొక్కలు నాటించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

సోమందేపల్లి : స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు ఎస్.ఆంజనేయులు జ్ఞాపకార్థం వారి కుమారులు ఐదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆంజనేయులు సుమారు 20 ఏళ్ల పాటు నలుగురు విద్యార్థులకు రూ. 500 చొప్పున అందజేశారన్నారు. ఆయన మరణాంతరం వారి కుమారులు ఎస్.వెంకటేష్‌కుమార్, జయప్రకాష్ తండ్రి ఆశయాలను కొనసాగించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు కె.మహిధర్, ఐశ్వర్య, నస్రిన్‌తాజ్, ఈ.మహిధర్‌లకు రూ. 500 చొప్పున ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీబాయి, ఉపాధ్యాయ బృందం రాజేశ్వరి, జవ్వాజి నాగరాజు, శ్రీనివాసులు, గోవిందప్ప, నరసింహారావు, ధనలక్ష్మి, ప్రభావతి, శాంతమ్మ, జలజాక్షి, జయంతి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన వైద్య బృందం

సోమందేపల్లి : స్థానిక సాయినగర్ పాఠశాలలో బుధవారం చోటుచేసుకున్న ఆకతాయి చేష్టల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యులు హరీష్ ఆధ్వర్యంలో గురువారం వైద్య బృందం పాఠశాలను సందర్శించి పిల్లల ఆరోగ్యంపై ఆరా తీశారు. పిల్లలకు ప్రాథమిక వైద్యం అందించి వారికి ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వైద్యం, మానసికమైన విద్య, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవరాయుడు, సూపర్వైజర్లు రవీంద్ర, రత్నమ్మ, ఎంఎల్ హెచ్‌పి శిరీష, ఆశా కార్యకర్తలు శాంతి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

14న యుటిఎఫ్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు

కదిరి టౌన్ : యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఈ నెల 14వ తేదీ జిల్లా స్థాయిలో మహిళా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను జయప్రదం చేయాలని జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పట్టణ ప్రధాన కార్యదర్శి భార్గవ, మహిళా నాయకులు మానస, అనిత, వనజ, సుజాత, యశోద, వెంకటనారాయణమ్మ, గంగరత్న క్రీడల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ షటిల్, షాట్‌పుట్, త్రోబాల్, స్పీడ్ వాక్, టెన్నికాయిట్, తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న మహిళా ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడల బ్రోచర్‌ను ఆవిష్కరించిన యుటిఎఫ్ నాయకులు

పోరాట యోధుడు సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-కదిరిటౌన్

దేశం ప్రజా ఉద్యమ యోధుడిని కోల్పోయిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి అనారోగ్యంతో దేశ రాజధాని ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి దేశ ప్రజలు, ప్రజా ఉద్యమకారులు, రైతులకు తీవ్ర ఆవేదన మిగిల్చిందన్నారు. చిన్నప్పటి నుంచే ఎర్రజెండానే శ్వాసగా ముందుకు సాగారని, అందులో భాగంగా అనేక పోరాటాలు చేశారన్నారు. సిపిఎం అనుబంధ విద్యార్థి విభాగం పురుడు పోసుకుందంటే సీతారాం ఏచూరే కారణమ న్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టడంతో పాటు బడాబాబులు, కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక, శ్రమజీవులకు అండగా ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. నేడు ఆయన తుది శ్వాస విడిచే వరకూ సిద్ధాంతాలే కర్తవ్యంగా పని చేశారన్నారు. ఆయన మృతి ప్రజలు, సిపిఎం, ఉద్యమకారులకు తీరని లోటు అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటం చేస్తూ పార్టీని ముందుకు నడిపిస్తామన్నారు. సీతారాం ఏచూరి ఆర్థిక, సామాజిక కార్యకర్తగా, 1992 నుంచి పొలిట్‌బ్యూరో సభ్యునిగా, 2005 నుంచి 2017 వరకూ రాజ్యసభ సభ్యులుగా దేశ ప్రజలకు సేవలందించారన్నారు.

పోరాట యోధుడిని కోల్పోయాం : సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

ప్రజా ఉద్యమాల పోరాట యోధుడిని కోల్పోయామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. కదిరి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడవడం బాధాకరమన్నారు.

కొత్తచెరువు : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో పుట్టపర్తి డివిజన్ సిపిఎం కార్యదర్శి అంజి, సిఐటియు మండల కార్యదర్శి ముత్యాలు, కో కన్వీనర్

నివాళి కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు



ఒడిసిలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

శంకర్‌రెడ్డి ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఎంపీగా, రాజ్యసభ సభ్యులుగా, జాతీయ కార్యదర్శిగా ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు.

మడకశిర రూరల్ : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల స్థానిక సిపిఎం నాయకులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. నాయకులు రామాంజనేయులు, బాషా, జిక్రియ, హనుమంతు, నాగరాజా మాట్లాడుతూ సీతారాం ఏచూరి మచ్చలేని నాయకుడని, ఆయన పార్టీకి, ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు

ఓబుళదేవరచెరువు : స్థానిక బస్టాండ్ కూడలిలో మండల సిపిఎం నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ చట్టసభల్లో పేదల గళం వినిపిస్తూ అడుగడుగునా అట్టడుగు వర్గాల అభివృద్ధికి పని చేసిన ప్రజా పోరాటయోధుడు అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వివి రమణ, శ్రీరాములు, కుళ్లాయప్ప, నరసింహులు, రామచంద్ర, వీరేంద్ర, అజయ్, శాంతమ్మ, రేణుక, ఏటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. రూరల్ మండలంలోని కుమ్మర వాండ్లపల్లిలో గురువారం ఎమ్మెల్యే రైతులకు రాయితీ ఉలవ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు నిత్యం పండించే పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దష్టి సారించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యా మ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తుందన్నారు. అందులో భాగంగా ఎపి సీడ్స్ రూ. 1600 కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ రైతులకు 80 శాతం రాయితీపై ఉలవలు పంపిణీ చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాది మాటల ప్రభుత్వం కాదు.. రైతు సంక్షేమ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో ఎపి సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య, ఎడిఎ సత్యనారాయణ, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : స్థానిక రైతు సేవా కేంద్రం–1,2 పరిధిలోని రైతులకు రాయితీపై ఉలవలు పంపిణీ చేసినట్లు ఏవో లోకేశ్వరరెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం ఉలవలు పంపిణీ చేస్తారన్నారు. అలాగే రైతులు ఏ పంటకు ఏ మందులు వాడాలి, తదితర విషయాలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి అంజనమ్మ, టిడిపి నాయకులు గంగిరెడ్డి, మౌలా, గంగశేఖర్, నరసింహారెడ్డి, బిజెపి నాయకులు బాబ్‌జాన్ పాల్గొన్నారు.



రైతులకు రాయితీ ఉలవ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

తలుపుల : తలుపుల–2, 3 రైతు సేవా కేంద్రాల్లో ఎంపిడిఓ కిరణ్‌మోహన్‌రావు, ఏవో షాదాబ్ రైతులకు రాయితీపై ఉలవ విత్తనాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఉలవలు అవసరమైన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ విఎస్ఎ యాసిన్, విహెచ్ఎ నిహారిక, రైతులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలోని రైతులకు ఇన్‌ఛార్జి ఎంపిపి బి.గంగోజమ్మ, సర్పంచి సుధాకర్ సబ్సిడీపై ఉలవ విత్తనాలు పంపిణీ చేశారని ఏవో లక్ష్మిప్రియ తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : స్థానిక రైతు సేవా కేంద్రంలో ఉలవ విత్తనాలు పంపిణీ చేసినట్లు ఏవో విజయ భారతి తెలిపారు. విత్తనాలు తీసుకున్న ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు సూర్యనారాయణ, సర్పంచి బాలాజీ, లక్ష్మణరావు, గోవిందరెడ్డి, నాగరాజు, డిఎస్‌ఎల్ శ్రీనివాసులు, ఎర్రగుంట చంటి పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి-గోరంట్ల

విజయవాడ వరద, ముంపు బాధితుల కోసం పట్టణంలో గురువారం కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. పట్టణంలో ప్రతి దుకాణం వద్దకు వెళ్లి విరాళాలు సేకరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ వరదలు విజయవాడ నగరాన్ని అతలాకుతలం చేశాయన్నారు. అక్కడి ప్రజలను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ తమ వంతుగా సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, ఆంజనేయులు, సాకే వెంకటేశులు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, ముత్యాలప్ప, భాస్కర్, రవి, రామాంజనేయులు, బాబా, నంజుండప్ప, ప్రదీప్, శోభ, గంగమ్మ, రామాంజనమ్మ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : టిడిపి ఆధ్వర్యంలో మండలంలోని



వరద బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్న కెవిపిఎస్, వ్యకాసం నాయకులు

కొండకమర్లలో విరాళాలు సేకరిం చారు. సీనియర్ నాయకులు పొగాకు జాకీర్ మాట్లాడుతూ మరో రెండు రోజులు విరాళాలు సేకరిస్తామని, ఫణిస్వామి రూ. 5116 విరాళం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్రారెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, సంగాల శ్రీనివాసులు, శంకరప్ప, రవి, అంజనప్ప, వి.శ్రీనువాసులు, సుధాకర్‌నాయుడు, వినోద్‌నాయుడు, ఈశ్వర్, గంగాద్రి, చంద్రాయుడు, చంద్ర, జనసేన పార్టీ నాయకులు సతీష్, పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో సమస్యలపై గురువారం సిపిఎం ఆధ్వర్యంలో నగర పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు హరి, బాబావలి మాట్లాడుతూ ఇటీవల సిపిఎం బృందం ఎన్టీఆర్ కాలనీలో పర్యటించగా కాలనీ వాసులు పలు సమస్యలు ఏకరువు పెట్టారన్నారు. కాలనీ ఏర్పాటు చేసి 8 ఏళ్లయిందని, 130 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. ప్రధాన రహదారి మినహా కాలనీలో సీసీ రోడ్లు లేవన్నారు. వీధి దీపాలు లేక రాత్రివేళ చోరీలు జరుగుతున్నాయని, చెత్తచెదారం, ముళ్లపొదలు దట్టంగా పెరిగాయని దీంతో విష పురుగుల బెడద ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని



నగర పంచాయతీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిప్పన్న, మహబూబ్‌బాషా, రాజురావు, కాలనీవాసులు నారపరెడ్డి, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

మనూర్‌తండాలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని మనూర్‌తండాలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కల్లుమర్రి వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి జ్వరాల సర్వే, రక్త పరీక్షలు చేశారు. ఎవరికీ డెంగీ, మలేరియా జ్వరాలు లేవని తెలిపారు. అలాగే పాఠశాలలో పిల్లలను పరీక్షించి వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న ఏడుగురికి వైద్య సేవలు అందించారు. పరిసరాలను పరిశీలించి పంచాయతీ సిబ్బంది చేత మురికి కాలువలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధుర్య, డాక్టర్ వినోద్‌కుమార్ హుస్సేన్‌బీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్, ఎఎన్ఎం రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి, జయమ్మ, సునీత, నాగారత్న పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ హుండీ లెక్కింపు



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

కదిరి అర్బన్ : పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించినట్లు ఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 43 రోజులకు నగదు రూ. 72,48,024, బంగారం 24 గ్రాములు, వెండి 807 గ్రాములు, విదేశీ కరెన్సీ యుఎస్ఎ డాలర్స్ 26 వచ్చినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణ అధికారిగా రమేష్‌బాబు, సీనియర్ సహాయకులు పాల్గొన్నారు.

విద్యా శాఖ సిబ్బందిపై దాడి హేయం

కొత్తచెరువు : కడప విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందిపై దాడి చేయడం తగదని జిల్లా వృత్తి విద్య అధికారి లాజర్, విద్యాశాఖ ఎడి నాగరాజు తెలిపారు. స్థానిక గాంధీనగర్ పాఠశాల లోని డీఈవో కార్యాలయం వద్ద గురువారం వారు సిబ్బందితో కలిసి ప్ల కార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలా దాడులు చేస్తే ఉద్యోగులు విధులు నిర్వహించలేరన్నారు. కార్యక్రమం లో సాయినాథ, సిబ్బంది పాల్గొన్నారు.

ముష్టికోవెలలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండలంలోని ముష్టికోవెల గ్రామంలో గురువారం కూడా ఎన్ఎస్.గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా గత మంగళవారం మండపం వద్ద ప్రసాదం తిని దాదాపు 50 మంది తీవ్ర అస్వస్థతకు గురికాగా సికె.పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేయడంతో వారికి వాంతులు, విరేచనాలు తగ్గాయి. డిఎంహెచ్ఓ ఆదేశాల మేరకు డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని ముష్టికోవెల వెళ్లి ఇంటింటి సర్వే చేపట్టారు. అలాగే ప్రజలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి భార్గవి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఎఎన్ఎం కుమారి, ఆశా వర్కర్లు నాగరత్న, గీతాంజలి, చంద్రమ్మ, కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ పోస్టర్ విడుదల

ఓబుళదేవరచెరువు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో గురువారం వైద్యాధికారి డాక్టర్ కమల్ రోహిత్ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ కార్యక్రమం పోస్టర్‌ను డాక్టర్ కమల్ రోహిత్, ఎంఇఓ రమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి ఆవిష్కరించారు. అలాగే మందుల స్టాక్‌ను సిబ్బందికి అందజేశారు. ఆరు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ సూపరింటెండెంట్ రెడ్డెప్ప, ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు గంగాద్రి, నారాయణస్వామి, జనార్దన్‌రెడ్డి, రమేష్‌నాయక్, నిర్మలమ్మ, గోపీనాథ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలోని గంగన్నగారిపల్లిలో గురువారం చెరువు రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న వైసిపి బిసి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ హరి ప్రసాద్ ఆ కుటుంబానికి రూ. 10వేలను వారి తండ్రి, మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ బాబా, వేణు, రెడ్డప్ప, పెద్దకిష్ట రామ్మోహన్, ప్రభాకర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

తలుపుల : తలుపుల–1 అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఎంపిడిఓ కిరణ్‌మోహన్‌రావు సందర్శించారు. ఆయన కేంద్రంలోని పలు రికార్డులను, గర్భిణులు, బాలింతలు, పిల్లల హాజరు పట్టికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

కుటుంబ పోషణ భారమై యువకుడు ఆత్మహత్య

హిందూపురం : కియాలో పని చేస్తూ ఆ వేతనంతో కుటుంబాన్ని పోషించలేక శ్రీధర్(28) గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని మోడల్ కాలనీలో నివాసం ఉంటున్న ఆదినారాయణప్ప కొడుకు శ్రీధర్ డిప్లొమా పూర్తి చేసి కియా పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. 9 నెలల క్రితం హిందూపురం రూరల్ మండలంలోని చౌళూరు గ్రామానికి చెందిన నిహారికతో వివాహమైంది. భార్య కోరిక మేరకు ఆమెను పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాలలో ఎంబిఎ చదివిస్తున్నాడు. కుటుంబ పోషణ, భార్య ఉన్నత చదువుల ఖర్చు, తల్లిదండ్రుల బాధ్యతల నేపథ్యంలో వేతనం సరిపోయేది కాదు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేశాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎఎస్ఐ అక్బర్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని, మృత దేహాన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

ధర్మవరం రూరల్ : మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో గురువారం భవన నిర్మాణ కార్మికుడు కుళ్లాయప్ప విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ధర్మవరంలోని యాదవ వీధికి చెందిన కుళ్లాయప్ప రోజు వారి పని నిమత్తం రేగాటిపల్లిలో రేకుల షెడ్డుపైన సిమెంట్ దిమ్మెలు కట్టడానికి వెళ్లాడు. పని చేస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మవరం రూరల్ పోలీసులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద...

కొత్తచెరువు : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న ఇటుకల బట్టీల వద్ద గురువారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి మృతుడిని కొత్తచెరువుకు చెందిన లోచర్ల గంగాధర్(35) గుర్తించారు. ఈయన మీర్జాపురం గ్రామం నుంచి ఇక్కడికి వలస వచ్చి బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రెండేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మద్యానికి బానిస అయ్యాడు. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయాడని అతడి చెల్లెలు తెలిపారు. తల, ముఖంపై తీవ్రగాయాలు ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేసి హత్య చేశారన్న అనుమానాలు ఉన్నాయి. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేసన్ సిఐ ఇందిర తెలిపారు.

హేళన చేసినందుకు దాడి

హిందూపురం : పట్టణంలోని రహమత్‌పురంలో బుధవారం అర్ధరాత్రి ఇంతియాజ్ అనే వ్యక్తి రేషం జబి ఇంటి వద్ద ఉన్నాడు. ఆ సమయంలో ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. అతడిని చూసిన ఇంతియాజ్ దొంగ దొంగ అని హేళన చేశాడు. దీంతో ఆవేశానికి గురైన ఆ యువకుడు పక్కనే ఉన్న మటన్ షాపులో కత్తి తీసుకుని దాడి చేయడంతో ఇంతియాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరుకు రెఫర్ చేశారు. దాడికి పాల్పడిన యువకుడిపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండేళ్ల క్రితం బైక్‌ల చోరీ కేసు నమోదైంది. దాడి సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ

చిలమత్తూరు : మండలంలోని కోడూరు థామస్ మన్రో తోపులో ఉన్న 16 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీకి గురైనట్లు జెఎల్ఎం బాషా తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఈ చోరీ జరిగి ఉంటుందని, దొంగలు సుమారు రూ.40 వేలు విలువ చేసే వైరు, ఆయిల్ ఎత్తుకెళ్లారని ఆయన తెలిపారు.

టిడిపికి పివి.చౌదరి సేవలు మరువలేనివి



పివి చౌదరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, పల్లె

కొత్తచెరువు : తెలుగుదేశం పార్టీకి పివి.చౌదరి చేసిన సేవలు మరువలేనివని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీరామ ఫంక్షన్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన పివి.చౌదరి సంతాప సభలో వారు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పివి చౌదరి టిడిపి ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకూ పార్టీకి, ప్రజలకు సేవలు అందించారన్నారు. మండలానికి రెండు పర్యాయాలు ఎంపిపిగా ఎన్నికై ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరని లోటు అన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పివి.చౌదరి కుమారులు పివి.ప్రసాద్, డాక్టర్ రాంప్రసాద్, టిడిపి నాయకులు పివి.జయప్రకాష్, శివప్రసాద్, బాబు, రమేష్ పాల్గొన్నారు.

డిసిసి అధ్యక్షుడికి నియామకపత్రం అందజేత

ప్రజాశక్తి-హిందూపురం



పిసిసి చీఫ్ షర్మిళ నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఎంహెచ్.ఇనాయతుల్లా

శ్రీ సత్యసాయి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా హిందూపురం పట్టణానికి చెందిన ఎంహెచ్.ఇనాయతుల్లాను నియమించారు. ఈ మేరకు గురువారం విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో పిసిసి చీఫ్ షర్మిల నుంచి నియమక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా షర్మిళ జిల్లా వ్యాప్తంగా పర్యటించి పార్టీని బలోపేతం చేయాలని సూచించినట్లు ఇనాయతుల్లా తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కషి చేస్తానన్నారు. త్వరలోనే అన్ని నియోజకవర్గాల్లోనూ నాయకులు, కార్యకర్తలను ప్రత్యక్షంగా కలిసి అందరూ ఏకతాటిపై నడిచి పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. తనను జిల్లా అధ్యక్షునిగా నియమించడంపై షర్మిళతో పాటు పార్టీ అగ్ర నేతలకు ఇనయతుల్లా కతజ్ఞతలు తెలియజేశారు.